క్లుప్తంగా

ముదిరాజ్‌లకు న్యాయం చేయాలి



మదనాపురం: ముదిరాజ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు స్థానిక నాయకులు ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూపులోకి మార్చాలని, ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్ అబ్రహంలింకన్‌కు వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా ఆర్థిక అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చీర్ల శ్రీనివాసులు, వెంకటస్వామి, అజ్జకొల్లు మాజీ సర్పంచ్ బ్రహ్మమ్మ సత్యం, చింతకాయల శ్రీను, శ్రీనివాసులు, రంగన్న, దొరబాబు, రాములు, శివరాములు, వెంకటేష్, గాండ్ల రాము, దారమోని శాంతన్న, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వాయిద్య కళాకారులను ఆదుకోవాలి



పెబ్బేరు రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం రాష్ట్ర మంగళ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి దొడ్ల అనిల్‌కుమార్, పరమేష్ నాయీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ శాఖలో భజంత్రీ నియామకాలు చేపట్టి వాయిద్య కళాకారుల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని, అలాగే ప్రభుత్వ పథకాలు పేద వాయిద్య కళాకారులకు అందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అనంతరం కళాకారులకు తోడుగా ఉంటూ సంకల్పాలను నెరవేరుస్తూ కళాకారుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు నాయకంటి వెంకటేశ్వర శర్మను శాలువా, పూలమాలతో సన్మానించారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ కళాకారులకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వాయిద్య కళాకారులు ఎస్ రంగస్వామి, శ్రీనివాసులు, నాగభూషణం, గోపాల్, రమేష్, చంద్రయ్య, బీచుపల్లి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి ఇటీవల బదిలీ, పదోన్నతిపై వెళ్లిన, ఇతర పాఠశాలల నుంచి బదిలీ, పదోన్నతిపై వచ్చిన ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. పాఠశాల నుంచి ఆరుగురు ఉపాధ్యాయులు వెళ్లగా.. 9 మంది ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చారని హెచ్‌ఎం చెన్నప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎక్కడ ఉన్నా ఉపాధ్యాయులు ఉన్నత విలువలు కలిగి పనిచేయాలన్నారు. విద్యార్థులను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దినప్పుడే వారి వృత్తికి న్యాయం చేసినవారవుతారని చెప్పారు. పాఠశాలలో విధులు నిర్వహించిన సమయంలో గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు ఎంతో సహకారం అందించారని బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశంకర్, శ్రీనివాసులు, ఆనంద్‌కుమార్, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి పోలీసుల చేయూత



అమరచింత: పట్టణంలోని ముస్లిం కాంప్లెక్స్‌లోని షెల్టర్‌లో ఉంటూ మైసమ్మ అనే వృద్ధురాలు భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుంది. కాలుకు గాయంతో నడవలేని స్థితిలో ఆమె ఉందని ఎస్‌ఐ సురేష్‌కుమార్‌కు సమాచారం అందడంతో వృద్ధురాలిని చేరదీసి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. వనపర్తి మండలంలోని అగ్రహారానికి చెందిన లక్ష్మయ్య, మైసమ్మ భార్యాభర్తలు. వీరికి రాములమ్మ, లక్ష్మమ్మ, ఉగ్గ నరసింహ అనే ముగ్గురు సంతానం ఉన్నారని మైసమ్మ తెలిపారన్నారు. కుటుంబ కలహాల కారణంగా మైసమ్మను పట్టించుకోకపోవడంతో ఇలాంటి పరిస్థితి దాపరించిందన్నారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియచేశామని, కాలి గాయంతో బాధపడుతున్న మైసమ్మను మున్సిపల్ సిబ్బంది సహకారంతో దుస్తులు తొడిగించి మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. దీంతో ఎస్‌ఐ సురేష్‌కుమార్‌కు పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



పాన్‌గల్‌లో..



నాగర్‌కద్మూర్ రైతువేదికలో..

రైతు సంక్షేమమే ధ్యేయం

ఆత్మకూర్/అమరచింత: కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే తప్పదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, దానిలో భాగంగానే రైతు రుణమాఫీ చేస్తున్నామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్‌తో కలిసి బాలకిష్టాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది కార్యకర్తలతో కలిసి అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో ఎడ్ల బండ్ల, బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత రాజశేఖరరెడ్డి తర్వాత రైతు రుణమాఫీ చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అమరచింత మండలంలోని నాగర్‌కద్మూర్ రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను ఏడీఏ దామోదర్ రైతులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన క్యార్యదర్శి ఆయూబ్‌ఖాన్, గంగాధర్‌గౌడ్, పరమేష్, రహ్మతుల్లా, నల్గొండ శ్రీను, తుల సీరాజ్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, తిరుమలేష్, మహంకాళి విష్ణు, వెంకటేశ్వర్ రెడ్డి, పోసిరి గారి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పి.ప్రశాంత్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సత్యారెడ్డి అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మండలంలోని అమడబాకుల రైతువేదిక వద్ద రైతులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి కొత్తకోటకు చేరుకుని స్థానిక చౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంజే బోయేజ్, కృష్ణారెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సలీంఖాన్ ఉన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రైతులు సంబరాలు చేసుకొని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి క్రిష్టారావు చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. మండలంలోని 28



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



రేవల్లిలో ఎద్దుల బండిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి

జీపీల్లో 3,030 మంది రైతులకు రూ.లక్ష రుణ మాఫీ అవుతుందన్నారు. అత్యధికంగా రేమద్దులలో 513, పాన్‌గల్‌లో 336, కేతేపల్లిలో 221 మంది రైతులు లబ్ధిపొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ ఎంపీటీసీ హైమావతి, వెంకటేష్ నాయుడు, రవికుమార్, రాముయాదవ్, గోవర్ధన్ సాగర్ ఏఓ సాజీద్‌రహమాన్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

మదనాపురం: స్థానిక రైతువేదికలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని మండల రైతులు తిలకించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి హైమావతి, ఏఈఓలు స్పందన, అనిత, జితేందర్, రైతులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి తలపెట్టిన రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు తిలకించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, ఎడ్లబండ్లతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణ రెడ్డి, ఎత్తం కృష్ణయ్య, బాల్‌రెడ్డి, ఇంద్రకంటి వెంకటేష్, గంగిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం, పెబ్బేరు మండల కేంద్రాల్లోని చౌరస్తాల్లో కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని పర్వతాపురం రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, ఏఈఓల ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ వీక్షించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖిల్లాఘనపురం బస్టాండు వద్ద సీఎం చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. పర్వతాపురంలో ఎద్దుల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, వెంకటయ్య, సాయిచరణ్‌రెడ్డి, క్యామరాజు, పాల ప్రకాష్, విజయలక్ష్మి, సత్యనారాయణ, రాజునాయక్, నర్సింహారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



కొత్తకోటలో హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు



ఖిల్లాఘనపురంలో..



పెబ్బేరులో..

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

కొత్తకోట రూరల్: ఇటీవల సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో ఎన్నో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అలాంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్థులు ఏదో బ్యాంకు పేరిట వాట్సాప్ యాప్‌లో లింక్ పంపిస్తున్నారు. దీన్ని వాట్సాప్ వినియోగించే వినియోగదారులు క్లిక్ చేస్తే మన వాట్సాప్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుందన్నారు. అంతే కాకుండా మన ఫోన్‌లోని నంబర్లందరికీ మెసేజ్ వెళ్తుంది. దీని ద్వారా సైబర్ నేరస్థులు మన గూగుల్‌పే, ఫోన్‌పే, యూపీఐ ద్వారా డబ్బులను దోచేస్తారని అవగాహన కల్పించారు. కాబట్టి అప్రమత్తంగా ఉండి అనవసర లింక్‌లు వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయకూడదని సూచించారు. వాట్సాప్ యాప్ పనిచేయకుంటే వెంటనే రీ ఇన్‌స్టాల్ చేసి రిపోర్ట్ చేయాలి. ఎవరైనా ఏదైనా నేరానికి గురయితే వెంటనే ఆలస్యం చేయకుండా 1930 కు కాల్ చేసి సమాచారం ఇవ్వడంతో పాటు www.cybercrime.gov.inలో రిపోర్ట్ చేయాలని సీఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



వెల్టూరులో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చిన్నంబావి: సైబర్ నేరాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ రమేష్ సూచించారు. ఆయన మండలంలోని వెల్టూరులో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంక్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, ఫోన్‌పే కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మేసేజ్‌లకు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని కోరారు.

మండేలా జీవితం ప్రపంచానికి ఆదర్శం



నెల్సన్ మండేలా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, నాయకులు

వనపర్తి టౌన్: మన కాలపు మహాత్ముడు మండేలా అని, జాతి వివక్షతకు ఉద్యమ బాటలు వేసిన నెల్సన్ మండేలా జీవితం ప్రపంచానికి ఆదర్శప్రాయమని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. నెల్సన్ మండేలా జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. దక్షిణాఫ్రికాలో శతాబ్దాలుగా జరుగుతున్న జాతి వివక్షతకు వ్యతిరేకంగా ఉద్యమించిన విప్లవ కారుడు నెల్సన్ మండేలా అని గుర్తుచేశారు. ఇంగ్లిష్ వలస పాలనకు వ్యతిరేకంగా నల్లజాతీయుల హక్కుల కోసం ఎనలేని పోరాటాలకు ఆద్యుడు నెల్సన్ మండేలా అని కొనియాడారు. స్వేచ్ఛ అంటే వ్యక్తిగతంగా ఉండేది కాదని, మానవ మనుగడకు, సమాజ శ్రేయస్సుకు సంబంధించిందని చెప్పిన గొప్ప ఉద్యమకారుడు నెల్సన్ మండేలా అని చెప్పారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, నరసింహాశర్మ, గంధం నాగరాజు, బాలేమియా, నాగన్న యాదవ్, బండలయ్య, కొమ్ము వెంకటస్వామి, బాలస్వామి నాయుడు, నరసింహ, గంధం కృష్ణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల గ్రామానికి చెందిన పెద్దన్నగౌడ్, మాధవి దంపతుల కుమార్తె పలుస లహరిగౌడ్ ఇటీవల వెలువడిన గ్రూప్–2 ఫలితాల్లో విజయం సాధించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాలలో ఉద్యోగం సాధించింది. గురువారం అమడబాకులలోని గౌడ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన లహరి ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నతస్థాయి ఉద్యోగం సాధించడం గ్రామానికి గర్వకారణమన్నారు. పలుస లహరిగౌడ్ ఇది వరకూ వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో కానిస్టేబుల్‌గా ఎంపికై వరంగల్ జిల్లాలో 35రోజులు పాటు శిక్షణ పొందింది. కార్యక్రమంలో సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, సత్యారెడ్డి, రంగారెడ్డి, మోహన్‌గౌడ్, గోపిగౌడ్, గోవర్ధన్‌గౌడ్, రాంచంద్రయ్యగౌడ్, జనార్దన్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, కృష్ణయ్యగౌడ్, గందురవిందర్‌గౌడ్, సతీస్‌గౌడ్, బుచ్చన్న, కావలి వెంకటయ్య తదితరులు ఉన్నారు.



లహరిని సన్మానిస్తున్న నాయకులు

కనిమెట్టలో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'



కనిమెట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్లు ప్రారంభించారు. రెండేళ్లు పూర్తయిన చిన్నారుల పేర్లను ఇంటింటికీ తిరుగుతూ నమోదు చేసుకుంటున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నర్సరీ తరగతులను ఇంగ్లిష్ మీడియంలో నిర్వహిస్తామన్నారు. రూ.వేలు ఖర్చు చేసి ప్రైవేట్ స్కూళ్లకు చిన్నారులను పంపకుండా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. గర్భిణులు, బాలింతలు, చంటి పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి, పీఎస్ హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయ బృందం, చిన్నారుల తల్లులు తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరం

కొల్లాపూర్ రూరల్: లచ్చనాయక్ తండా, రాంనాయక్ తండాలో పెంట్లవెల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర పీడితులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు చంద్రశేఖర్, బాలకృష్ణ, అధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' జయప్రదం చేయండి

పాన్‌గల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఐసీడీఎస్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సంఘం మండల నాయకులు శారద, అలివేల, మాధవి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలను 3వ తరగతి, హెల్పర్స్‌ను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ. 26 వేలు, పెన్షన్ నెలకు రూ.10 వేలు, పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, జీఓ నెం.10ని రద్దు చేయాలని, 24 సమ్మె హామీల అమలు వంటి డిమాండ్లపై ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలని ధర్నా

పెబ్బేరు రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 458, 545, 555 సర్వే నంబర్‌లో 13 ఎకరాల 39 గుంటల భూమిని హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులకు ఓఆర్సీ ఇచ్చి అమలు చేయాలని పెబ్బేరు తహసీల్దార్‌కు వనపర్తి ఆర్డీఓ ఆదేశించారు. ఆ ఓ ఆర్సీ అమలు నిలుపుదల చేయాలని గురువారం ప్లాట్ల బాధితులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ 2008 సంవత్సరంలో 458, 545, 555 సర్వే నెంబర్‌లో 13 ఎకరాల 39 గుంటల భూమిలో కనకదుర్గ, శ్రీనివాస రియల్ ఎస్టేట్ వారు వెంచర్లు చేసి ప్లాట్లను ప్రజలకు విక్రయించారు. ఇప్పుడు హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు వచ్చి ఆ నంబర్లలో ఉన్న భూమి తమదని, మాఫీ ఇనాం అంటూ వనపర్తి ఆర్‌డీఓకు అప్పీల్ చేశారు. రైతులతో గానీ, ప్లాటు యజమానులతో సమగ్ర విచారణ జరపకుండా తూతూ మంత్రంగా హియరింగ్ జరిపి హైదరాబాద్ వాసులకు ఈ భూమి చెందే విధంగా హక్కు పత్రం అమలు చేసే విధంగా స్థానిక తహసీల్దార్‌కు ఆదేశించడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్లాట్ల బాధితులు



వర్షాలకు ఇళ్లు నేలమట్టం

పెబ్బేరు రూరల్: కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాల కారణంగా శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో వడ్ల వెంకటయ్య నివాస గృహం గురువారం మధ్యాహ్నం కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఘటన జరగడంతో ఎలాంటి ప్రాణనష్టం కలగలేదు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించాలని బాధితుడు కోరారు.

'ముసురు'లో సంత

అమరచింత: పట్టణంలో గురువారం జరిగిన వారాంతపు సంతలో కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకునేందుకు వస్తున్న రైతులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఎప్పుడు పడితే అప్పుడు వర్షం పడుతుండటంతో తమ వ్యాపారం కుంటుపడిందని ఆయా గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంత బజారులో కనీస వసతులు ఏర్పాటు చేయలేని మున్సిపల్ అధికారులు తమ నుంచి పన్నులు ఎలా వసూళ్లు చేస్తారని ప్రశ్నిస్తున్నారు.





కేతేపల్లిలో చెత్తకుప్పలు ఇలా...

వ్యాధుల కాలం.. పర్యవేక్షణ లోపం

- పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం
- రోడ్లపై పారుతున్న మురుగు
- పొంచి ఉన్న రోగాలు

పాన్‌గల్: పల్లెల్లో ప్రత్యేక పాలన పడకేసింది. ఎక్కడికక్కడ సమస్యలు వెక్కిరిస్తున్నాయి. పారిశుద్ధ్యం లోపించి వీధుల్లో దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు కాల్వల శుభ్రత, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి పైపులైన్ మరమ్మతుకు నిధుల కొరత వెంటాడుతోంది. వానాకాలం ప్రారంభం కావడంతో వ్యాధుల బెడద పొంచి ఉంది. ఫాగింగ్ యంత్రాలు కరవయ్యాయి. పంచాయతీలకు నియమించిన ప్రత్యేక అధికారులు మాతృ శాఖ విధులకే పరిమితవుతూ.. కేటాయించిన గ్రామాల వైపు కన్నెత్తి చూడటంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదో ప్రభుత్వ కార్యక్రమాలకు చుట్టపు చూపులా వచ్చి వెళ్తున్నారనే విమర్శలున్నాయి. దీంతో ప్రతి చిన్న పనికి కార్యదర్శులే దిక్కువుతున్నారు. కొద్ది నెలలుగా పంచాయతీలకు నిధుల మంజూరు లేకపోవడంతో ఇబ్బందుల పరిస్థితి నెలకొంది.



గోప్లాపూర్‌తండాలో ఇళ్ల ఎదుట పెంట కుప్పల్లో నిలిచిన వర్షపు నీరు

తూతూమంత్రంగా డ్రై డే..

ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే లను వైద్య సిబ్బంది, అధికారులు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాల్సి ఉన్నా.. ఆ ఊసే లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో వ్యవరిస్తూ సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్యం చేస్తూ అప్రమత్తత చేయకపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు.

డ్రెయినేజీలు నిర్మించాలి..



గ్రామంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉండడంతో పాటు రోడ్లపై పారుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది, దుర్వాసన వస్తుంది. సీసీ రోడ్లు ఉన్న సరైనా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి.

– మల్లేష్‌యాదవ్, శాగాపూర్


గ్రామాల్లో పర్యటించని అధికారులు..



సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత జీపీలకు నియమించిన ప్రత్యేక అధికారులు గ్రామాల్లో ఎక్కడ కూడా పర్యటించడం లేదు. దీంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలం సీజన్ కావడంతో చాలా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి రోగాలు సంభవించే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ పారిశుద్ధ్య చర్యలు ప్రతి నిత్యం నిర్వహిస్తూ సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్య నివారణపై ప్రజలను చైతన్యం చేయాలి.

– సూర్యవంశం రాము, సీపీఎం మండల నాయకులు

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాం..



సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించాం. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించాం. జీపీలకు నిధుల కొరత ఇబ్బందిగా ఉన్నా అత్యవసర సమస్యలను పరిష్కారం చేస్తున్నాం. డ్రెయినేజీలు లేని జీపీల్లో ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని ప్రజలకు సూచించిన వారు పట్టించుకోపోవడం లేదు. గ్రామాల్లోకి ప్రత్యేక అధికారులు వెళ్లాలని స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చాం. మరోమారు సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకుంటాం.

– కోటేశ్వర్, ఎంపీడీఓ, పాన్‌గల్